మహాలక్ష్మీ నమోస్తుతే



ఇచ్ఛాపురం:పూజలందుకున్న స్వేచ్ఛావతి అమ్మవారు

శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం అమ్మవారి ఆలయాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అర్చకుల మంత్రోచ్చారణల నడుమ కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. మొదటి శుక్రవారం కావడంతో పలువురు మహిళలు వ్రతాలు ఆచరించారు. అనంతరం ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం: సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు



టెక్కలి: జగద్ధాత్రిదేవి ఆలయంలో కుంకుమ పూజలు



కవిటి: బెజ్జిపుట్టుగలో సామూహిక కుంకుమార్చన

క్లుప్తంగా

శాశ్వత భూహక్కు పాస్ పుస్తకాల పంపిణీ



పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఢిల్లీరావు

కంచిలి: మండలంలోని పెద్దకొజ్జిరియా గ్రామ రైతులకు మంజూరైన 'జగనన్న శాశ్వత భూహక్కు' పట్టాదారు పాసుపుస్తకాలను సర్పంచ్ పొందల ఢిల్లీరావు శుక్రవారం పంపిణీ చేశారు. స్థానిక శివాలయం ఆవరణలో వీఆర్వో హర్ష ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొదటి దశలో 499 మందికి పాసు పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో ప్రధాన లజపతి, పాశాల ఉపేంద్ర, ప్రసాదరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం



సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

టెక్కలి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని టెక్కలి ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు. టెక్కలి గోపినాథపురంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనంలో వివాహాల వల్ల శిశు మరణాల రేటు పెరుగుతుందన్నారు. అనారోగ్యంతో పిల్లలు జన్మిస్తారని చెప్పారు. అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిషేధానికి ప్రతిఒక్కరూ చైతన్యం కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హెచ్.వి.రమణమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వివేకానందా, ఎస్‌ఐ రామకృష్ణ, న్యాయవాదులు డి.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబాలకు సాయం అందజేస్తున్న ప్రతినిధులు

టెక్కలి: టెక్కలికి చెందిన అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో పలువురు దాతలు వైద్యానికి శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. సోంపేటకు చెందిన దున్న ఈశ్వరరావు ఇటీవల రైలు ప్రమాదానికి గురై కాలు కోల్పోవడంతో అతనికి రూ.10 వేలు అందించారు. టెక్కలి ఎన్‌టీఆర్ కాలనీకు చెందిన కూర్మాపు సంతోష్‌కుమార్ ఇటీవల ఓ ప్రమాదంలో గాయపడటంతో అతనికి రూ.6 వే అందజేశారు. పట్టణానికి చెందిన వైద్యులు సీపాన శ్రీనుబాబు, అన్నెపు వినోద్‌కుమార్ చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు డి.శ్రీనివాస్, ప్రతినిధులు బి.మధు, ఎస్.సింహాచలం, పి.రమేష్, ఎ.వీరభద్రాచారి, ఎస్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి



ఎంపీడీఓ రమణమూర్తిని సత్కరిస్తున్న డీఎల్‌పీఓ రమణ

టెక్కలి: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ అన్నారు. ఇటీవల జిల్లా స్థాయిలో ఉత్తమ ఎంపీడీఓగా అవార్డు అందుకున్న టెక్కలి ఎంపీడీఓ హెచ్.వి.రమణమూర్తిని శుక్రవారం సత్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షన్‌దారులకు అండగా ప్రభుత్వం



భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

సోంపేట: ప్రభుత్వ పెన్షన్‌దారులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోంపేట పట్టణంలో జెడ్పీ నిధులతో నిర్మించిన ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం భవనాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వానికి విశ్రాంత ఉద్యోగులు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారానికి ముందుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద, వైఎస్సార్ సీపీ మండల కమిటీ అధ్యక్షుడు తడక జోగారావు, ఉప సర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ పొడుగు కామేష్, సంఘ ప్రతినిధులు పండి, కృష్ణారావు, జోగారావు, పండా, ఎం.వీరన్న పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



వజ్రపుకొత్తూరు రూరల్: ఢిల్లేశ్వరరావును సన్మానిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు



ఇచ్ఛాపురం రూరల్: సత్కారం పొందిన ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు రూరల్: విధి నిర్వహణలో అందించిన సేవలతో ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని వక్తలు కొనియాడారు. బాతుపురం ప్రాథమిక పాఠశాలలో ఏడేళ్ల పాటు విధులు నిర్వర్తించి చినడోకులపాడు పాఠశాలకు బదిలీ అయిన ఉపాధ్యాయుడు గనియా ఢిల్లేశ్వరరావుకు శుక్రవారం గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిని లక్ష్మినారాయణ, హైస్కూల్ హెచ్‌ఎం సుభాష్ చంద్రబోస్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మీనాక్షి, పీఎంసీ చైర్మన్లు చెల్లూరి నీలకంఠేశ్వరరావు, తామాడ ప్రదీప్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తామాడ సురేష్, మాజీ సర్పంచ్ తామాడ అప్పలస్వామి, బత్తిని మోహన్‌రావు, తామాడ తులసీదాసు, రెయ్యి ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: మండలం బిర్లంగి ఉన్నత పాఠశాలలో పనిచేసి వేరే ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు వాసంతి పట్నాయక్, భాస్కర్ పాడి, అంపోలు రాజేష్, గోవింద్ సాహూ, కుసుమలను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం పి.వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోండి



ఎమ్మెల్సీ నర్తు రామారావుకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ కవిత

కవిటి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. శుక్రవారం లండారిపుట్టుగ పంచాయతీ కొత్తపుట్టుగలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ శిబిరంలో ఆయన వైద్యపరీక్షలు చేయించుకున్నారు. బెలగాం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కవిత ఆధ్వర్యంలో 85 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది సంతోష్, సాయి, అరుణ రాజేంద్ర నాయక్ పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న శ్రీకాకుళం ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి భాస్కరరావు

సోంపేట: సోంపేట కోర్టుల సముదాయంలో ఈ నెల 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని శ్రీకాకుళం ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.భాస్కరరావు కోరారు. ఈ మేరకు సోంపేట కోర్టుల సముదాయంలో శుక్రవారం న్యాయవాదులు, సోంపేట సర్కిల్ డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఎ.రాము, సోంపేట సీఐ ఆర్.రవిప్రసాద్, ఎస్‌ఐలు జి.శంకరరావు, బి.హైమావతి, ఎస్.చిరంజీవి, కె.గోవిందరావు, న్యాయవాదులు శైలేంద్ర, జోగారావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలాస: పలాస విద్యుత్తు సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పలాస ఏఈ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పారిశ్రామికవాడ, శ్రీనివాస నగర్, నెహ్రూనగర్, రోటరీనగర్, ఎంపీడీఓ కార్యాలయం ఏరియా, పాత జాతీయ రహదారి, పూజారి వీధి, పద్మనాభపురం, నెమలినారాయణపురం, రెంటికోట వరకు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం



అన్నాపురంలో పోలింగ్ ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరెడ్డి

నందిగాం: అన్నాపురం పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నిక పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. శనివారం జరగనున్న పోలింగ్‌లో 791 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. దీనికోసం అన్నాపురం ప్రభుత్వ పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నిక జరుగుతుంది. 2 గంటల నుంచి లెక్కింపు చేపడతారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

వజ్రపుకొత్తూరు: మండలంలోని ఉద్దానం గోపినాథపురం పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి పరిశీలించారు. పంచాయతీలో 4వ వార్డుకు శనివారం ఉప ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, గ్రామంలో పరిస్థితులపై ఆరా తీశారు. శాంతి భద్రలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్‌ఐ వై.మధుసూదనరావును డీఎస్పీ ఆదేశించారు.

హరిజన వీధుల పేర్లు మార్చాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న పూర్ణచంద్రుడు

కంచిలి: మండలంలో వివిధ గ్రామాల్లో ఉన్న హరిజన వీధుల పేర్లను తొలగించి, కొత్త పేర్లు పెట్టాలని, తలతంపర గ్రామంలో ఎస్సీ వీధిని 'హరిజన వీధి'గా పిలుస్తున్నారని, దాని పేరును మార్చాలని జైభీమ్ సేన జిల్లా కోశాధికారి మర్రిపాటి పూర్ణచంద్రుడు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ చల్లా శ్రీనివాసరెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యుడు జర్జాన భగవతిరావు ఉన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు సత్కారం



సీఆర్‌పీ శ్రీనివాసరావును సన్మానిస్తున్న దృశ్యం

కంచిలి: వరుసగా రెండోసారి జిల్లాస్థాయిలో ఉత్తమ సీఆర్‌పీగా ఎంపికై 77వ స్వాతంత్య్ర వేడుకల్లో అవార్డు అందుకున్న పెద్దశ్రీరాంపురం స్కూల్ కాంప్లెక్స్ సీఆర్‌పీ సంక శ్రీనివాసరావును కత్తివరం ప్రాథమికోన్నత పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.పాఠశాల ఆవరణలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు, హెచ్‌ఎం మాధవీబెహరా, విద్యాకమిటీ చైర్మన్ సూర్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత



సాయం అందజేస్తున్న సర్పంచ్

కోటబొమ్మాళి: కస్తూరిపాడు పంచాయతీ గంగుపేటలో గంగు వెంకటరమణ అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గురువెల్లి గోవిందరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్ఎస్ చైతన్య పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

కంచిలి: ఉద్దానం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 184వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా శనివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంచిలి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఉదయం 9 నుంచి శిబిరం కొనసాగుతుందని, యువత స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

సర్వసభ్య సమావేశం నేడు

వజ్రపుకొత్తూరు రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి తెలిపారు. అన్ని శాఖాలకు అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

వైఎస్సార్‌సీపీతోనే అన్నింటా అభివృద్ధి



ఎక్కల గ్రామంలో పథకాల కరపత్రాన్ని అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

• జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కంచిలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనతోనే రాష్ట్రంలో అన్నింటా పూర్తిస్థాయి అభివృద్ధి సాధ్యపడుతోందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. కేసరపడ సచివాలయం పరిధి ఎక్కల పంచాయతీలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా వర్తించిన పథకాలు, ప్రయోజనాలు, ప్రభుత్వ విధానాలు, గతం-ప్రస్తుత ప్రభుత్వం పాలన వ్యత్యాసాలను వివరించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ రంగాల గాయత్రి, బెల్లుపడ సర్పంచ్ అయధం జయరాం, మెండ ప్రకాశరావు, రంగాల శ్రీను, కప్పల యుగంధర్, హరిబంధు జన్ని, రంగాల దీనబంధు, రుషి, సంతోష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంతోషాలు



సీతాపురంలో పథకాల లబ్ధిని వివరిస్తున్న సమన్వయకర్త దువ్వాడ వాణి

• టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి

టెక్కలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పారదర్శకంగా అందజేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబంలో సంతోషాలు కనిపిస్తున్నాయని వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. టెక్కలి మండలం సీతాపురం పంచాయతీలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి గత నాలుగున్నరేళ్లుగా అందజేసిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బి.దేవయాని, పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఎస్.సత్యం, నాయకులు ఎస్.రాఘవరావు, చింతాడ గణపతి, బి.కర్మవీరుడు, టి.జగ్గారావు, బి.అప్పలసూరి, బి.ఉదయ్, జోగారావు, బి.భుజంగరావు, బి.రాజేష్, ఎస్.కృష్ణ బి.బలుసాకు, డి.కిరణ్, బి.గోవింద్, బి.లక్ష్మీపతి, బి.విశ్వనాథం, బి.మల్లేశ్వరావు, ఎస్.శంకర్, ఎస్.ఉమాపతి, డి.కామన్న, ఎల్.రాంబాబు, పి.శ్రీను, బి.రామకృష్ణ,బి.ధనుంజయ్, జి.అప్పలరెడ్డి, ఎ.రాహుల్, హర్ష, ఎస్.మోహన్, టి.లోకేష్ , ఎ.రవికుమార్, సర్పంచ్‌లు జి.మోహన్‌రెడ్డి, ఎం.శంకర్, కె.కామేష్, ఎస్.అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కొఠారిచండీ ఆలయంలో చోరీకి యత్నం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పిరియా సాయిరాజ్, ఎస్‌ఐ రాము

కవిటి: ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం కొఠారిచండీ అమ్మవారి ఆలయంలో గురువారం రాత్రి చోరీకి దుండగులు ప్రయత్నించారు. ఈ విషయం సర్పంచ్ జానకిరావు, ఎంపీటీసీ కృష్ణారావు ద్వారా తెలుసుకున్న పార్టీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఎస్‌ఐ కె.రాముతో కలిసి శుక్రవారం ఆలయాన్ని సందర్శించారు. ఆలయం వెలుపల చిన్నపాటి హుండీలో మాత్రమే చోరీకి పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. గర్భగుడి వస్తువులు చోరీకి గురికాలేదని వివరించారు.

రక్తదానంపై అపోహలు వీడాలి



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

టెక్కలి: రక్తదానంపై అపోహలు వీడి స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, రిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులంతా కలిసి 97 యూనిట్ల రక్తం దానం చేశారు. కార్యక్రమంలో వైద్యులు భరద్వాజ్, లిఖిత, శ్రీకాంత్, కళాశాల అధ్యాపకులు ఎ.ఎస్.శ్రీనివాసరావు, డి.విష్ణుమూర్తి, ఎం.జయమన్మథరావు, బి.బలరాం, ప్రకాశ్‌రావు, నర్సింహమూర్తి, చంద్రశేఖర్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఎస్.సంతోష్, బి.వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు

వజ్రపుకొత్తూరు: మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ సీహెచ్.ఈశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.


యోగా విజేతకు అభినందనలు

ఇచ్ఛాపురం: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఈ నెల 13న నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన శ్రీకాంత్ మహంతి మొదటి స్థానం సాధించాడు. 18 నుంచి 28 సంవత్సరాల విభాగంలో ఈయన ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను స్థానిక యోగ సాధకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు శుక్రవారం అభినందించారు.

సర్పంచ్‌కు పరామర్శ

నందిగాం: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన నందిగాం మండలం నౌగాం సర్పంచ్ పుష్పా సత్యంను కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి శుక్రవారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు డాక్టర్ రామ్మోహనరావు, టెక్కలి పీఏసీఎస్ అధ్యక్షుడు సత్తారు సత్యం, శ్రీధర్‌రెడ్డి, ఆనంద్, మాధవ్ సతీష్ పాల్గొన్నారు.

గురుదాసుపురంలో వైద్య శిబిరం



పలాస: మండలంలోని గురుదాసుపురంలో శుక్రవారం రెంటికోట ప్రాథమిక వైద్య కేంద్రం వైద్యాధికారి సునీల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 55 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రాణిప్రభ, ఎంఎల్‌హెచ్‌పీ తేజేశ్వరి, 104 వాహనం డీఈఓ బి.లోకేష్, ఆశావర్కర్, హెల్త్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ 4జీ టవర్లు మంజూరు

కోటబొమ్మాళి: మండలంలో తాటిపర్తి, కమలనాభపురం, కూర్మనాథపురం గ్రామాల్లో కొత్తగా బీఎస్ఎన్ఎల్ 4జీ సెల్‌టవర్లు ఏర్పాటు చేయనున్నట్లు నరసన్నపేట సంస్థ సబ్ డివిజనల్ కార్యాలయ ఇంజినీర్ బి.రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లో సెల్ సిగ్నల్ తక్కువగా ఉన్నందున వీటిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్థలం కేటాయించాలని తహశీల్దార్ జామి ఈశ్వరమ్మకు ఇటీవల దరఖాస్తు చేశామని, మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా సంతోషిమాత ఉజ్జీవన



ఘటాలతో సంతోషిమాత అమ్మవారి ఊరేగింపు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని తిప్పనపుట్టుగలో ఒరియా వీధిలో శుక్రవారం సంతోషిమాత ఉజ్జీవన ఘనంగా జరిగింది. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి వేషధారణలో మేళతాళాలు మధ్య భక్తులు ఘటాలను ఊరేగించారు. అనంతరం ఈదుపురం బహుదానదిలో నిమజ్జనం చేశారు.

భక్తిశ్రద్ధలతో పూర్ణకలశ ప్రతిష్టాపన



వజ్రపుకొత్తూరు రూరల్: గుణుపల్లిలో శుక్రవారం కాళికామాత ఆలయ పూర్ణకలశ ప్రతిష్టాపన భక్తిశ్రద్ధలతో జరిగింది. తిర్రి కుటుంబీకులు ఆరాధ్యదైవంగా పూజించే అమ్మవారికి సాంస్కృతిక కార్యక్రమాలు నడుమ పూర్ణకలశాన్ని ఊరేగిస్తూ ముర్రాటలు, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం శిఖరంపై నుంచి బూరెలు జారవిడిచగా, మహిళలు తమ కొంగులతో పట్టుకున్నారు.